సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

శనివారం 4-1-2025

సంపుటి: 20 సంచిక : 240

పేజీలు: 4 వెల : రూ.1



దశాబ్దాలుగా అనేక పదవులతో
ఉద్యోగులను పోరుబాటలో నడిపించి
విజయాలు అందించిన
**చౌదరి పురుషోత్తమనాయుడు** గారు
ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్
అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి
మాత్రమే కాదు.. జిల్లాలో
ఎంతోమందికి తలలో నాలుక..
బాధ్యత ఎదైనా బరువనుకోకుండా
బంధంతో ముడివేసి అందరివాడిగా
ఆదరణ పొందిన నాయుడు గారి
విశ్రాంత జీవితం ప్రజా, సామాజిక సేవలో
కొనసాగాలని, భవిష్యత్ తరాలు ఆయన్ను
స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని ఆకాంక్షిస్తూ..

## పదవీ విరమణ
## శుభాకాంక్షలు

**శ్రీ చౌదరి పురుషోత్తంనాయుడు** గారు
కాశీబుగ్గ సర్కిల్ గూడ్స్ & సర్వీసెస్ టాక్స్ అధికారి (విశ్రాంత),
పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
జీఎస్టీ అధికారులు, ఉద్యోగుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు.

HOTEL
**SVD**
Family Restaurant A/c
SVD Cross Roads,Srikakulam-532001. A.P.
Cell:94401 95442,
94401 95543,99855 58662

• ఎడిటోరియల్

# దేశంలో నాలుగోవంతు మంది పేదలే

దేశంలో పేదరికం దాదాపు అంతరించిపోయిందంటూ కొన్ని సంస్థలు ఊదరగొడుతున్నాయని, కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఓ అధ్యయనం తేల్చింది. ఈ వాదనలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదనే విషయంపై తగిన గణాంకాలు అందుబాటులో లేనందున ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆ అధ్యయనం తెలిపింది. సీపీ సేతు, ఎల్టీ అభినవ్ సూర్య, సీపీ రుతు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఇటీవల ప్రచురితమైంది. అధికారిక గణాంకాల ప్రకారం దేశంలో నాలుగో వంతు మంది ప్రజలు.. అంటే జనాభాలో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని అధ్యయనం తెలిపింది. ఇది 2022–23లో నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నుంచి తీసుకున్న సమాచారమేనని చెప్పింది. దేశంలో పేదరిక నిష్పత్తి ఐదు శాతం కంటే తక్కువగానే ఉన్నదంటూ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం గత సంవత్సరం చెప్పిన మాటలకు ఇది పూర్తి భిన్నంగా ఉండడం గమనార్హం. ‘వ్యవసాయ అధ్యయనాల సమీక్ష’ పేరిట వచ్చిన ఓ పత్రికలో సంపాదకీయం ప్రచురితమైంది. దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదన్న విషయంపై గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం పెదవి విప్పడం లేదని ఆ సంపాదకీయం గుర్తు చేసింది. అందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి నాణ్యమైన సమాచారం అందుబాటులో లేకపోవడం, రెండోది పేదరికాన్ని లెక్కించే విధానంలో ప్రభుత్వం మార్పులు చేయడం. జీవన ప్రమాణాలకు సంబంధించిన వివిధ కోణాల నుంచి పేదరికాన్ని లెక్కించడానికి వినియోగ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. బెంగళూరులోని వ్యవసాయ అధ్యయనాల ఫౌండేషన్ ఆన్‌లైన్‌లో నిపుణులతో చర్చాగోష్టిని నిర్వహించింది. పేదరికానికి సంబంధించి గత డిసెంబర్ 18న దేశంలో అధికారిక అంచనాలేవీ లేకపోవడాన్ని వారు గుర్తించారు. పేదరికాన్ని ఏదో ఒక పద్ధతిలో లెక్కించాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధురా సామినాథన్ చెప్పారు. పేదరికానికి సంబంధించిన చిట్టచివరి అధికారిక అంచనాలు 2013లో ప్రణాళికా సంఘం నుంచి వెలువడ్డాయి. ప్రొఫెసర్ సురేష్ టెండుల్కర్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిఫార్సు చేసిన దారిద్ర్య రేఖ ఆధారంగా ఆ అంచనాలను రూపొందించారు. 2011–12 సంవత్సరపు వినియోగ వ్యయ సర్వేను కూడా ఈ బృందం పరిగణనలోకి తీసుకుంది. కాగా దేశ జనాభాలో పేదలు గ్రామీణ ప్రాంతాల్లో 25.7 శాతం, పట్టణ ప్రాంతాల్లో 13.7 శాతం ఉన్నారని సంపాదకీయం తెలిపింది. యూపీఏ ప్రభుత్వం సి. రంగరాజన్ నేతృత్వంలో మరో నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. టెండూల్కర్ బృందం సూచించిన దారిద్ర్యరేఖ కంటే రంగరాజన్ బృందం సూచించింది కొంచెం ఎక్కువగా ఉంది. మనుగడ కోసం ఆహార వస్తువులపై పెట్టే ఖర్చుతో పాటు కొన్ని అత్యవసర ఆహారేతర వస్తువులపై పెట్టే వ్యయాన్ని కూడా అది పరిగణనలోకి తీసుకుంది. 2011–12లో దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 30.9 శాతం, పట్టణ ప్రాంతాలలో 26.4 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారని నిపుణుల బృందం అంచనా వేసింది. అయితే ఈ అంచనాలను ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించలేదు. 2011–12 నుంచి 2024 ప్రారంభం వరకూ వినియోగ వ్యయంపై అధికారిక గణాంకాలేవీ విడుదల కాలేదు. 2022 ఆగస్టు నుంచి 2023 జులై వరకూ జరిపిన వినియోగ వ్యయ సర్వే వివరాలను గత సంవత్సరం విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే సమాచారాన్ని గతంలో జరిపిన సర్వేలు అందించిన సమాచారంతో పోల్చలేము. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నమూనాల రూపకల్పనలో, ప్రశ్నావళిలో, సమాచార సేకరణలో అనుసరించిన పద్ధతులలోనూ మార్పులు చోటుచేసుకోవడమే దీనికి కారణం. తమ అధ్యయనం కారణంగా వెలుగుచూసిన విషయాలను పరిశీలిస్తే సిగ్గుచేటుగా ఉన్నాయని ‘వ్యవసాయ అధ్యయనాల సమీక్ష’ వ్యాఖ్యానించింది. ‘దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాల్లో 27.4 శాతం, పట్టణ ప్రాంతాల్లో 23.7 శాతం మంది పేదలు ఉన్నారన్న అంచనా ప్రకారం గ్రామాల్లో 246.7 మిలియన్లు, పట్టణాల్లో 114.4 మిలియన్ల మంది పేదలు ఉన్నారని అర్థమవుతోంది. మొత్తంగా చూస్తే 361 మిలియన్ల ప్రజలు రంగరాజన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నిర్ధారించిన కనీస వ్యయాన్ని సైతం భరించే స్థితిలో లేరు. అమెరికా మొత్తం జనాభాకంటే మన దేశంలోని పేదలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జీడీపీ లేదా జాతీయాదాయాన్ని బట్టి చూస్తే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. పేదరికంతో బాధపడుతున్న వారిని సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచంలో మనదే మొదటి స్థానం. ఇది సిగ్గుచేటైన రికార్డు’ అని ఆ అధ్యయనం వివరించింది. రంగరాజన్ కమిటీ ప్రతిపాదించిన పద్ధతిపై అధ్యయన రచయితలు దృష్టి సారించారు. దారిద్ర్యరేఖను లెక్కించడానికి దానినే ఉపయోగించారు. దేశంలో పేదరికంతో బాధపడుతున్నవారు జనాభాలో 26.4 శాతం ఉన్నారని తేల్చారు.

# అంధుల పాలిట ఆరాధ్య దైవం బ్రెయిలీ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి, జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీను (అంధ ఉద్యోగి) ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని కేంద్రంలో ఉంటున్న మానసిక వికలాంగులకు అందజేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 1809 సంవత్సరం జనవరి 4 పారిస్‌కు తూర్పున ఇరవై మైళ్ల దూరంలో ఉన్న హొకూ ప్రేహా అనే చిన్న గ్రామంలో జన్మించారని, బ్రెయిలీ తల్లిదండ్రులు చేస్తున్న పనిలో నిమగ్నమై ఉండగా ఆ సమయంలో కత్తితో ఆడు తుండగా కత్తి యొక్క చివరి భాగంగా తన కంటికి తగలడం వల్ల చిన్న వయసులోనే తన చూపును కోల్పోయారన్నారు. అయినప్పటికీ నిరాశ పడకుండా చదువు కొనసాగించేవారన్నారు. లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని, స్పర్శ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం వలన ఈరోజు అంధులు ఉన్నతస్థితిలో ఉండడానికి ముఖ్య కారణమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విసిఎ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు.

జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా తక్కువ ఖర్చుతో పనిచేసే మైక్రోస్కోపిక్ లేజర్ లైట్‌ను వ్యక్తిగత విభాగంలో మండలంలోని మామిడిపల్లి హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ దార ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అతనిని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావు, ఉపాధ్యాయులు పి.ప్రసాద్, కె.అయ్యప్ప, ఎల్.వెంకటరావు, ఎం.ప్రకాశం అభినందనలు తెలిపారు.

– సత్యంన్యూస్, పార్వతీపురం



## విద్యార్థులు నైపుణ్యతను పెంచుకోవాలి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

గ్రామీణ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యతను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ అన్నారు. శనివారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రాంకు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్యం గల వారికే ఉద్యోగావకాశాలకు లభిస్తున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన డిగ్రీ కళాశాలలలో విద్యార్థులకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని, నైపుణ్యాన్ని పెంచడానికి అవసరమైన వనరులను సమకుర్చామన్నారు. కళాశాల డైరెక్టర్ సీహెచ్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో తరచూ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌చార్జ్ ఎం. శ్రీనివాసరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి బి.సాయిరాం, సమన్వయకర్త పి.దివ్య, ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధి జి.పద్మావతి, కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు అశ్విని, రాము తదితరులు పాల్గొన్నారు.

# 5 నుంచి సిక్కోలు డ్వాక్రా బజార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో సిక్కోలు డ్వాక్రా బజార్ పేరిట ఈ నెల 5 నుంచి 7 రోడ్ల కూడలిలోని మున్సిపల్ మైదానంలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి, అమ్మకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బజార్‌లో చేనేత వస్త్రాలు, హస్తకళలు, చేతి వంటల ఆహార పదార్థాలు తదితర ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరుదైన, ప్రత్యేకమైన, మార్కెట్‌లో లభించని అనేక ఉత్పత్తులు, చేనేత చీరలు, దుస్తులు, చిత్రాలు, శిల్పాలు, నగలు, పిక్కలు, స్వీట్లు, బొమ్మలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల కృషిని ప్రోత్సహించడానికి ఇది మంచి అవకాశమని, ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించి వాటిని కొనుగోలు చేయడం ద్వారా జిల్లా ప్రజలు వారిని ఆర్థికంగా కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.

# లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



లయన్స్ క్లబ్ సేవలు విస్తృతము చేస్తామని, రానున్న 2025–2026 సేవా కార్యక్రమాలు కోసం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. జనవరి 5న నరసన్నపేటలో జరగనున్న థర్డ్ డిస్ట్రిక్ట్ కాబినెట్ సమావే శంలో లయన్స్ గవర్నర్ ప్రొఫెసర్. ఎన్.వి.బి.ఎస్.ఎస్. ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, లయన్స్ క్లబ్ నరసన్నపేట మిలినియం క్లబ్ హోస్ట్ చేస్తున్నాయని, 5న లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 316ఏ కాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలతోపాటు, భవిష్యత్ సేవాకార్యక్రమాల వివరా లను, శాశ్వత సేవలను పొందుపరుస్తారన్నారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ వద్దు – గుడ్డ సంచులే ముద్దు అనే నినాదంతో గవర్నర్ చేతుల మీదుగా గుడ్డ సంచులను ప్రారంభించి అందిస్తారని, ఎనిమిది జిల్లాల సభ్యులతో 65 క్లబ్స్ నుండి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని, సమావేశం బంగారు వెండి వర్తకుల సంఘ భవనం, నరసన్నపేటలో జరుగుతుందన్నారు.





ఒక రచయిత(ప్రకాశ్ రాజ్) కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణమై ఎవరికీ తెలియకుండా తను ప్రేమించిన మహిళ(అర్చన) ఇంటికి వచ్చారు. ఇద్దరూ ప్రేమికులే! అయినా విడిపోయి వేర్వేరు పెళ్లిళ్లు చేసుకుని పాతికేళ్ల కాలం ఒకరినొకరు కలవకుండా గడిపారు. ఇన్నాళ్లకు మళ్లీ కలిశారు. ఆమె భర్త చనిపోయాడు. కూతురు మరెక్కడో ఉండి చదువుతోంది. ఆయనను అమితంగా ప్రేమించే ఆయన భార్య(రేవతి) తన ఇంట్లో ఉంది. ఇది వీళ్లిద్దరి కాలం. వీళ్లకు మాత్రమే సొంతమైన 24 గంటల కాలం.

# అక్రమ సంబంధాలు ఉండొచ్చు.. అక్రమ అనుబంధాలు ఉండవు!

అతను ఆమె చేతి వంట తిని, ఆనాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నాడు. ఎందుకు విడిపోయారో, ఇన్నాళ్లకు ఎందుకు కలిశారో! దేనికీ సమాధానం లేదు. ఉన్నది వాళ్లిద్దరి మధ్య బంధమే! అంతా బాగుందనుకుంటే వింతేముంది? ఉన్నట్టుండి ఆయనకు గుండెపోటు వచ్చింది. ప్రాణం పోయింది. ఇప్పుడేంటి పరిస్థితి? ప్రపంచం దృష్టిలో తనేమిటి? ఆమెకు, ఆయనకు నడుమ ఉన్న సంబంధం ఏమిటి? అన్నీ ప్రశ్నలే! సమాధానాలు లేవు. చెప్పగలిగిన వారు ఎవరు? చెప్తే అర్థం చేసుకోగలిగిన వారు ఎవరు? పోలీసులు, మీడియా రకారకాల ఊహాగానాలు చేస్తున్నారు.

భర్త ప్రాణం పోయిందని తెలిసిన రేవతి అర్చన ఇంటికి వస్తుంది. ఇళ్లంతా శూన్యం. అర్చన మనసులాగే! వచ్చినావిడ గోల చేయదు. ఈమెను నిలదీయదు. నోరారా తిట్టదు. అనుమానించదు. “మీ కూతురుకు చాలామంది మగ స్నేహితులు ఉంటారు. వాళ్లు ఎవరైనా ఇంటికి వచ్చినప్పుడు ఇలా జరిగితే అనుమానిస్తామా? అవమానిస్తామా?” అంటుంది. ఎంత గొప్ప మాట! ఎంత గొప్ప మనసు! ఎలా? ఎలా సాధ్యమైంది? “నా భర్త రచయిత. ఎన్నో ఉదాత్తమైన పాత్రలు రాశారు. వాటినే ఆయన అంత గొప్పగా చిత్రించినప్పుడు, ఇన్నాళ్లు ఆయనతో కలిసి ఉన్న నేను ఇంకెంత ఉదాత్తంగా ఆలోచించాలి? అలా ఆలోచించ లేకపోతే మా దాంపత్య బంధానికి అర్థమేమిటి?” అంటుంది. ఆ మాటతో మనకు ఏడుపుగా అనిపిస్తుంది.

గొప్ప కథకు గొప్ప నటులు కుదిరినప్పుడు ఆ సినిమా ఎంత హృద్యంగా ఉంటుందో చెప్పడానికి 2019లో వచ్చిన తమిళ సినిమా ‘అళియాద కోళంగల్’ గొప్ప ఉదాహరణ. దేశం గర్వించదగ్గ నలుగురు నటులు ఇందులో నటించారు. అర్చన, రేవతి, ప్రకాశ్ రాజ్, నాజర్. అందులో ముగ్గురు జాతీయ పురస్కార గ్రహీతలు. సరైన పాత్రలు దొరకాలిగానీ, వాళ్ల నటన సంగతి చెప్పేదేముంది? ప్రముఖ దర్శకుడు, ఛాయాగ్రాహకుడు బాలూ మహేంద్ర మరణానంతరం ఆయనకు నివాళిగా తీసిన సినిమా ఇది. అందుకే ఆయన 1979లో తీసిన సినిమా ‘అళియాద కోళంగల్’ పేరే దీనికి పెట్టారు. అంటే ‘చెదిరిపోని ముగ్గులు’ అని అర్థం. ఈ చిత్రంలో పాత్రలు అలాంటివే! సరైన చిత్రానికి సరైన పేరు. ఎం.ఆర్.భారతి ఈ సినిమాకి దర్శకుడు.

‘సినిమాలో నా పాత్రకు ప్రాధాన్యం ఉన్న ఒక్క సన్నివేశం అయినా సరే నటిస్తాను’ అంటుంటారు నటీనటులు. దొరకాలి కదా? ఈ చిత్రంలో నటి రేవతికి అలాంటి పాత్ర దొరికింది. ఆమె కనిపించేది రెండే సన్నివేశాలు. అయితేనేం? అందర్నీ డామినేట్ చేసేంత బలమైన నటనతో ఆకట్టుకున్నారు. సినిమా పూర్తయ్యాక ఆమె పాత్రే గుర్తుండిపోతుంది. అర్చన మాత్రం తక్కువా? చిత్రం చివర్లో రేవతి ఆమెతో మాట్లాడి వెళ్లాక అర్చన తన మనసులో భారం దించేసుకుని వానలో తడుస్తూ, తనివితీరా వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆ సన్నివేశంలో ఆమె తడుస్తూ ఏడుస్తుంది. అప్పటిదాకా కథలో లీనమైన ప్రేక్షకులు తడవకుండా ఏడుస్తారు.

పక్క మనిషి మీద కాసింత ప్రేమ, కాస్త స్నేహం చూపించడానికీ నోచని స్థితి వస్తే అదేమి జీవితం? ఆడామగా కలిసి ఉన్న ఒక సందర్భానికీ పెడార్థాలు తీస్తే అదేమి సమాజం? ఈ ప్రపంచంలో అక్రమ సంబంధాలు ఉండొచ్చు. అక్రమ అనుబంధాలు ఉండవు. ప్రతి అనుబంధమూ గుండె లోతుల్లో నుంచి పుట్టేదే! అర్థం చేసుకోలేని మనుషులు ఏమి మనుషులు? ప్రేమ చాలా విలువైనది. అందరూ దాన్ని ఎంచలేరు.

– విశీ(వి.సాయివంశీ)

# ఈ అప్పన్న చిట్టిబాబుని మించుతాడా..?

శంకర్ డైరెక్షన్‌లో గేమ్ ఛేంజర్‌గా రాబోతున్న రామ్ చరణ్ సంక్రాంతికి బ్లాక్‌బస్టర్ టార్గెట్‌తో వస్తున్నాడు. గేమ్ ఛేంజర్ ట్రైలర్ చూస్తే వింటేజ్ శంకర్‌ని చూసినట్టు ఉంది. తన సినిమాల్లో మంచి సోషల్ మెసేజ్‌ని ఇస్తూ కావాల్సిన కమర్షియల్ హంగులతో డెకరేట్ చేస్తాడు శంకర్. అందుకే ఆయన సినిమాలకు కేవలం సౌత్ లోనే కాదు పాన్ ఇండియా లెవెల్‌లో ఫ్యాన్స్ ఉంటారు. ఐతే 30 ఏళ్ల కెరీర్‌లో గేమ్ ఛేంజర్ సినిమా తో స్ట్రైట్ తెలుగు సినిమా చేశారు శంకర్. ఈ సినిమా తో మరోసారి తన డైరెక్షన్ స్టామినా చూపించబోతున్నారు. ఐతే ఈ సినిమా లో రాం చరణ్ రెండు డిఫరెంట్ రోల్స్ లో కనిపించనున్నారు. అందులో ఒకటి ఐ.ఏ.ఎస్ రోల్ కాగా మరొకటి అప్పన్న పాత్ర. అప్పన్న పాత్ర ఫ్లాష్‌బ్యాక్ లో వస్తుందని తెలుస్తుంది. ఆ రోల్ సినిమాకు ఆయువు పట్టు లాంటిదని అంటున్నారు. అంతేకాదు ఆ పాత్రకు ఒక లోపం కూడా ఉంటుందని అంటున్నారు. ఆల్రెడీ రామ్ చరణ్ నటించిన రంగస్థలం సినిమాలో చిట్టి బాబు పాత్రకి చెవుడు ఉంటుంది. మరి అప్పన్న పాత్రకు ఏం లోపం ఉందో తెలియదు కానీ సినిమాలో ఆ పాత్రలో చరణ్ అదరగొట్టాడని అందరు చెబుతున్నారు. ఆ పాత్ర చూసే రామ్ చరణ్ కి నేషనల్ అవార్డ్ కూడా వస్తుందని డల్లాస్ ఈవెంట్ లో సుకుమార్ చెప్పాడు. ఐతే రంగస్థలంలో చిట్టి బాబు పాత్ర పీక్స్ లో ఉంటుంది. అలా ఎవరు చేయలేరు అనే రేంజ్‌లో చరణ్ మెప్పించాడు. ఇక ఇప్పుడు అప్పన్న పాత్ర కూడా అదే తరహాలో చాలా నావెలిస్టిక్‌గా ఉంటుందట. గేమ్ ఛేంజర్ లో అప్పన్న పాత్ర రంగస్థలం లో చిట్టిబాబు పాత్రని ఓవర్ టేక్ చేస్తుందా లేదా అన్న డిస్కషన్ సోషల్ మీడియాలో జరుగుతుంది. ఏది ఏమైనా గేమ్ ఛేంజర్ సినిమా విషయంలో దర్శక నిర్మాతలు నెక్స్ట్ లెవెల్ ప్లానింగ్‌తో వస్తున్నారు. సినిమా ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా మెగా ఫ్యాన్స్ కి మంచి ఊపు తెస్తుంది. సాంగ్స్, యాక్షన్, రొమాన్స్, ఎంటర్టైన్మెంట్ ఇలా అంతా కూడా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసేలా ఫుల్ ప్యాక్డ్ ఎంటర్టైనర్‌గా వస్తుంది. మరి ఈ సినిమా తో రాం చరణ్ రికార్డుల సౌండ్ ఎలా ఉండబోతుందో చూడాలి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...





అధికారిగా ఆయన సంతకానికి కాలం చెల్లిపోయివుండొచ్చు.. ఉద్యోగ సంఘ నాయకుడిగా ఆయన పదవీ కాలం పూర్తయి వుండొచ్చు.. ఒక ఉద్యోగికైనా, ఉద్యోగ సంఘ నాయకుడికైనా ఇది సాధారణం. ఏదో ఒకరోజు పదవీ విరమణ తప్పదు. కానీ ఇక్కడ ప్రజల హృదయాల్లో ఉద్యోగుల మస్తిస్కాలలో పూర్తిగా ఆయనే నిండిపోయిన తర్వాత విరమణ ఉద్యోగానికే గాని, ప్రజా హృదయాల నుంచి కాదని రుజువు చేస్తున్నారు. గత నెల 31న కాశీబుగ్గ జీఎస్టీ అధికారిగా ఆయన పదవీ విరమణ చేసినా, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న అనేకమంది ఆకాంక్షల నేపథ్యంలో రాష్ట్ర ఎన్జీజీవోస్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు పయనంపై 'సత్యం' జరిపిన ఇంటర్వ్యూ..



# విశ్రాంత జీవితం 'రాము'డుకి అంకితం

- రాజకీయాల్లోకి వస్తాను
- ఉద్యోగ సంఘ నాయకుడిగా సంతృప్తి
- మా కుటుంబంలో ప్రజాస్వామ్యం ఎక్కువ
- పదవులు రాకపోయినా ఫర్వాలేదు.. క్యారెక్టర్ వదులుకోను



**సత్యం: జిల్లా ఎన్జీవో నాయకుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, సహాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, జీఎస్టీ అధికారుల సంఘం జోనల్ అధ్యక్షుడిగా, జీఎస్టీ అధికారిగా 39 ఏళ్ల సర్వీసులో నిరంతరం బిజీగా గడిపిన మీరు ఇప్పుడు విశ్రాంత జీవితాన్ని ఎలా ప్లాన్ చేశారు?**

నాయుడు: నాకు రాజకీయాలంటే ఇంట్రెస్ట్. వాటిని ఉద్యోగ సంఘాల వైపు మళ్లించి, వారి సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నించాను. భవిష్యత్తులో సామాజిక కార్యక్రమాల్లో పార్టిసిపేట్ చేస్తాను. రాజకీయాల్లో చేరాల్సిన అవసరమైతే ఉంది. నాకు రామ్మోహన్నాయుడు గారంటే చాలా ఇంట్రెస్ట్. ఆయన అడుగుజాడల్లో నడుద్దామని భావిస్తున్నాను. ఆయనంటే ఉద్యోగులకు చాలా ఇష్టం. 12 ఏళ్లుగా ఆయన వృద్ధిలోకి రావాలని కోరుకున్నాం. ఇప్పుడు పదవీ విరమణ ద్వారా ఆయనతో కలిసి నడిచే అవకాశం కలిగింది.

**సత్యం: ఉద్యమ రాజకీయాల్లో ఉన్న మీరు ఆదివారం మీ సన్మాన కార్యక్రమం వేదిక మీదే టీడీపీలో చేరుతారని ప్రకటించే అవకాశముందా?**

నాయుడు: అలా ఏం లేదు. ముందుగా రామ్మోహన్నాయుడు గారు చేస్తున్న ప్రజాసేవకు అండగా నిలబడతాను. ఉద్యోగంలో ఉండటం వల్ల గతంలో ఆయనకు బహిరంగంగా మద్దతు తెలపలేకపోయాం గానీ, లోపాయికారిగా ఆయన కోసం పని చేశాం. కొన్నాళ్లు ఆయనతో ప్రయాణించిన తర్వాత పరిస్థితులను బట్టి రాజకీయ తీర్థం పుచ్చుకునే అవకాశాలు లేకపోలేదు. ఆయన మంచి మనసుకు, ప్రజాసేవకు ఇంతకుముందే ఇంప్రెస్ అయ్యాను.



**సత్యం: మీ చిన్నాన్న చౌదరి బాబ్జీ టీడీపీలో ఉన్నారు. మీరు టీడీపీకి అనుకూలంగానే మాట్లాడుతున్నారు. కానీ మీ అబ్బాయి సతీష్ మాత్రం వైకాపాలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు మీరు టీడీపీకి వెళ్తే.. సతీష్ కూడా పార్టీ మారుతారా?**

నాయుడు: మా కుటుంబంలో ప్రజాస్వామ్యం నాలుగు పాదాలా నడుస్తుంది. కమ్యూనిస్టు పార్టీలో ఉన్న గ్రూపులన్నింటిలోనూ మా పెద్దలున్నారు. ఎవరి ఇండివిద్యువాలిటీ వారిది. ఒకరు ఎంఎల్ గ్రూపులో ఉండొచ్చు, ఒకరు సీపీఎంలో ఉండొచ్చు, ఒకరు వైకాపాలో ఉండొచ్చు.. మాది పెద్ద ఫ్యామిలీ. మా నాన్న తరపు పదిమంది, అమ్మ తరపు పదిమందితో పాటు వారి చుట్టాలు, బంధువులు రకరకాల పార్టీల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సహజం. ఎవరు ఏ పార్టీలో ఉంటారన్నది వారిష్టం. ఎవర్నీ మనం ఇన్ఫ్లుయెన్స్ చేయలేం. ఎవరు ఏ పార్టీలో ఉన్నా కుటుంబంతో కలిసి వుండటం, పార్టీ కోసం బలంగా పని చేయడమే మాకు తెలిసిన విద్య. ప్రస్తుతం సతీష్ వైకాపాలో ఉన్నా ఆ పార్టీలో క్రియాశీలక పదవిలో లేడు. ఆ పార్టీ గత కొన్నాళ్లుగా ప్రజలకు దూరంగా ఉంది. సతీష్ ప్రస్తుతం కార్యకర్తగా మాత్రమే ఉన్నాడు. ప్రస్తుతానికి పార్టీలో ఇన్యాక్టివ్గానే ఉన్నాడు. భవిష్యత్తులో ఏం నిర్ణయం తీసుకుంటాడో ఆయనిష్టం. ఆ విషయంలో నేనైతే ఆయనపై ఒత్తిడి తీసుకురాను. నేనైతే రామ్మోహన్నాయుడు గారితోనే ఉంటాను.

**సత్యం: గడిచిన మూడు సార్వత్రిక ఎన్నికల నుంచి మీరు ప్రత్యక్ష బరిలో ఉంటారని వింటున్నాం. ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ చేస్తారని భావించేవారు. ఆ విధంగా అప్పట్లో మీకు ఏదైనా పార్టీ నుంచి ఆఫర్ వచ్చిందా?**

నాయుడు: అప్పట్లో కొంతమంది అడిగిన మాట వాస్తవమే. ఇంటెలిజెన్సీ నుంచి, కొన్ని పార్టీల నుంచి పోటీ చేస్తారా అంటూ అభిప్రాయాన్నయితే అడిగేవారు. మా ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రతిభాభారతి మేడమ్ గారిని చూస్తూ పెరిగాం. మా తాత గారు ఎమ్మెల్యే కావడం, ప్రతిభాభారతి నాన్నగారు ఎమ్మెల్యే కావడం వల్ల రాజకీయాల పట్ల నాకు ఆసక్తి కలిగింది. దీనికి తోడు ప్రతిభాభారతి గారు ఎమ్మెల్యే కావడం, స్పీకర్ కావడం, మంత్రి కావడం వంటివి దగ్గరుండి చూశాను. మేం హైదరాబాద్ వెళితే ఆమె క్వార్టర్లో ఉండటం, అలా కుటుంబ పరంగా మేడమ్తో మంచి అనుబంధం మాకు కొనసాగేది. ప్రతిభాభారతి గారు వేరే నియోజకవర్గానికి మారిన తర్వాత రామ్మోహన్నాయుడు మీద అభిమానం పెంచుకున్నాం. మధ్యలో బంధుత్వం వల్ల కృపారాణి గారితో కూడా నడిచాం. అప్పుడే మా అబ్బాయి సతీష్ ప్రజారాజ్యం కాంగ్రెస్లో విలీనమైన తర్వాత కృపారాణి గారితో పయనించాడు. జాగ్రత్తగా పరిశీలిస్తే పార్టీలు కాకుండా నాయకులతోనే నా రిలేషన్ కొనసాగింది. ఇప్పుడున్న సిట్యుయేషన్లో నాకు బాగా కావాల్సిన నాయకుడు కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు. ఇది పూర్తిగా నా పర్సనల్ రిలేషన్. ఇంతవరకు ఆయన్ను పార్టీ మనిషిగా నేను చూడలేదు. ఇప్పుడు నేను ఫ్రీ అయ్యాను కాబట్టి భవిష్యత్తులో ఏం చేయాలనేది ఆయన ద్వారానే నిర్ణయం తీసుకుంటాను.

**సత్యం: మీరు పదవీ విరమణ చేసిన తర్వాత జీఎస్టీ ఆఫీసర్స్ & ఎంప్లాయీస్ అసోసియేషన్లో గ్రూపులు లేనట్టు, అంతా కలిసిపోయినట్టు కనిపిస్తుంది. నిజమేనా?**

నాయుడు: కమర్షియల్ టాక్స్ ఉద్యోగ సంఘం విషయంలో విజయనగరం జోన్ వరకు ఎప్పుడూ వన్సైడెడే. 90 శాతం ఉద్యోగులు నాతోనే ఉండేవారు. విజయనగరం డివిజన్ ప్రెసిడెంట్గా నేను ఏడుసార్లు ఎన్నికయ్యాను. కేఆర్ సూర్యనారాయణకు, ప్రస్తుత ఎమ్మెల్సీ అశోక్బాబుకు ఉన్న వైరం వల్ల ఏపీఎన్జీవో సంఘాన్ని వదిలేయమని నాకు చెప్పడం, నేను అంగీకరించకపోవడంతోనే జీఎస్టీ ఉద్యోగుల సంఘంలో రెండు వర్గాలు మీకు కనిపించాయి. సంఘం వేరైనా తనతో వ్యక్తిగతంగా ఎవరూ విభేదించలేదు. అందుకు కారణం నేను ఎవర్నీ నష్టపర్చలేదు. జెండాలు, అజెండాలు వేరైనా వ్యక్తిగతంగా నా పట్ల వైరుధ్యం ఎవరికీ లేకపోవడం వల్లే ఇప్పుడంతా ఒకటిగానే కనిపిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎవరికి నచ్చిన సంఘంలో వారుండవచ్చు. నా పనితీరు చూసి చాలామంది మారారు. ఎందుకంటే.. ఉద్యోగులంటేనే ఇంటిలెక్చువల్స్. సమస్యల కోసం ఎవరు చిత్తశుద్ధిగా పని చేస్తున్నారో వారికీ తెలుసు.

**సత్యం: సుదీర్ఘ కాలం ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యవర్గానికి మీరు ఎన్నికవుతూవచ్చారు. జిల్లాలో మీరు ఎవర్ని నిలబెడితే వారే అధ్యక్ష కార్యదర్శులు లేదా మిగిలిన సభ్యులుగా కొనసాగుతూవచ్చారు. అసలు ఈ ఎన్జీవో సంఘం మీద మీకు అంత పట్టు ఎలా వచ్చింది?**

నాయుడు: ఎంప్లాయీస్ మధ్య చిన్న చిన్న బేదాభిప్రాయాలు వస్తుంటాయి. ఒక లైవ్ ఆర్గనైజేషన్లో ఇవన్నీ కామన్. ఎంత బాగున్నా దగ్గర దగ్గర పనిచేయడం వల్ల చిన్న బేదాభిప్రాయాలు ఉంటాయి. వాటిని మనం మనస్ఫూర్తిగా సెట్ చేయాలి. దాన్ని రాజేసి రాజకీయాలు చేయాలని చూస్తే మరో రకంగా ఉంటుంది. వారి మధ్య రాజీ కుదర్చడం, ఐకమత్యంగా పని చేయించగలగడమే నా సక్సెస్ మంత్రం. ఎవరైతే యాక్టివ్గా ఉన్నారో వారిని నాయకత్వంలోకి తీసుకొచ్చాం. కులసమీకరణాలను లెక్కలోకి తీసుకోకుండా పని చేసేవాడే పదవిలో ఉండాలన్న సిద్ధాంతమే మమ్మల్ని బలోపేతం చేసింది. నేను పని చేస్తాను, నాకు పదవి కావాలనేవాడ్ని తొక్కేస్తే సంఘం ముందుకు నడవలేదు. అటువంటివారిని గుర్తించి ముందువరుసలో పెడితేనే మనకు బలం. ఇబ్బందీ ఉండదు.

**సత్యం: పక్క రాష్ట్రాల్లో ఉద్యోగుల సంఘాలు పార్టీకి అఫ్లియేటెడ్గా పని చేస్తున్నాయి. మన దగ్గర మాత్రం ఏపీ ఎన్జీవో సంఘం న్యూట్రాలిటీ మెయింటైన్ చేస్తూ ఎలా మనగలిగింది? దానికి తోడు ఉద్యోగులు ఏదో ఒక పార్టీతో అంటకాగుతున్న రోజుల్లో న్యూట్రల్ ప్లాట్ఫామ్ అంటూ ఏపీ ఎన్జీజీవోస్ ఎలా నిలదొక్కుకుంది?**

నాయుడు: 74 ఏళ్లుగా ఏపీ ఎన్జీవో సంఘం రాజకీయంగా తటస్థ వైఖరినే అవలంభిస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు పని చేసినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మా డిమాండ్లు నెరవేర్చుకోవడం కోసమే వారితో కలిసి నడిచాం తప్ప రాజకీయ పార్టీల కోసం ఏనాడూ పని చేయలేదు. సంఘ నాయకులు, ఉద్యోగుల్లో ఒక్కొక్కరికి ఒక్కో పార్టీ మీద మోజు ఉండొచ్చు. కానీ అది సంఘం మీద రిఫ్లెక్ట్ కాకుండా చూసుకోగలిగాం. ముఖ్యమంత్రి ఎవరైనా గుడ్ రిలేషన్ మెయింటైన్ చేశాం. ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభించనంత వరకు ముఖ్యమంత్రులతో మంచిగానే ఉన్నాం. ఉద్యోగులకు వ్యతిరేకంగా వ్యవహరించిన అనేక ముఖ్యమంత్రులతో విభేదించిన సందర్భాలూ ఉన్నాయి.

**సత్యం: ఎన్జీవో సంఘంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకు అనేక పదవులు నిర్వహించిన మీరు ఏ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నారని భావించారు?**

నాయుడు: కచ్చితంగా గత వైకాపా ప్రభుత్వమే. 27 శాతం ఉన్న ఐఆర్ను 23 శాతానికి తగ్గించేశారు. ఫిట్మెంట్ బెనిఫిట్ కూడా తగ్గించిన ప్రభుత్వం వైకాపాయే. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. పెద్ద ఉద్యమాన్ని చేపట్టినా ఉక్కుపాదంతో అణిచేశారు. అద్దాల పెట్టెలో ఉన్న ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వం తలచుకుంటే పెద్ద పనేం కాదు. అదే పని వైకాపా చేసింది. దాని పర్యవసానమే తర్వాత ఎన్నికల్లో చూశాం. ట్రేడ్ యూనియన్లయితే ప్రభుత్వం మీద దండయాత్ర చేయగలవు. కానీ ఉద్యోగ సంఘాలు ఆ పని చేయలేవు. ఏదో ఒక పార్టీతో అనుబంధంగా ట్రేడ్ యూనియన్లు పని చేస్తున్నందున వారికిది సులువు. కానీ ఉద్యోగులు పార్టీలతో అనుబంధంగా ఉండరు. సమయం వచ్చినప్పుడు మాత్రమే ఉద్యోగులు సత్తా చూపిస్తారు.

**సత్యం: ఇప్పటి వరకు అందరివాడిగా ఉన్న పురుషోత్తమనాయుడు భవిష్యత్తులో ఒక పార్టీ వైపు వెళ్లిపోతే కొందరివాడిగా మిగిలిపోతాడన్న భయం మీకు లేదా?**

నాయుడు: ఒక ఉద్యోగిగా, ఉద్యోగుల సంఘ నాయకుడిగా ఉద్యోగులందరికీ అందరివాడిగా ఉండగలిగాను. ఇందులో ఎక్కడా పార్టీలతో సంబంధం లేకుండా వ్యవహరించగలిగాను. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్లగలిగాను. కానీ ప్రజాసేవ చేయాలనుకుంటే మాత్రం రిటైరైన తర్వాత ఏదో ఒక పార్టీ వైపు వెళ్లకతప్పదు. పార్టీ పాలసీ ప్రకారం మాట్లాడటమే తప్ప వ్యక్తిగత విమర్శలు, దూషణలు నావల్ల కాదు.

**సత్యం: ప్రస్తుత రాజకీయాల్లో దూషణలు, తిట్లు, వ్యక్తిగత విమర్శలు చేసినవారికే పదవులు ఇస్తున్నారు కదా.. మీరు పాలసీ మీదే మాట్లాడతామంటే పదవులొస్తాయా?**

నాయుడు: పదవులు రాకపోయినా ఫర్వాలేదు కానీ, ఎవర్నీ ఊరకనే తిట్టడం, ట్రోల్ చేయడం వంటివి నావల్ల కాదు. పదవి రాకపోయినా ప్రజల కోసం పని చేసుకుపోతాను. నాయకుడికి అనుకూలంగానో, పార్టీ పాలసీని జనం మధ్యకు తీసుకువెళ్లడానికో పనికొస్తాను గాని, వ్యక్తిగతంగా తిట్టడమంటే నావల్ల కాదు.

**సత్యం: సుదీర్ఘ కాలం ఉద్యోగ సంఘ నాయకుడిగా పని చేసిన మీరు మీ హయాంలో ఇది సాధించాను అని చెప్పకోవాలంటే దేన్ని ముందుకు తెస్తారు?**

నాయుడు: వాస్తవానికి 19వ రాష్ట్ర మహాసభలు జిల్లాలో నిర్వహించాం. అప్పుడు నేను రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఉన్నాను. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు 20 శాతం హెచ్ఆర్ఏ తీసుకువచ్చాం. నిజానికి 2 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతానికి 20 శాతం హెచ్ఆర్ఏ రాదు. అప్పటికి మనం 14 శాతం హెచ్ఆర్ఏతో ఉన్నాం. ఈ మహాసభల ద్వారా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి 20 శాతం చేయగలిగాం. దీనివల్ల జిల్లా కేంద్రంలో ఉన్న 7వేల మంది ఉద్యోగులకు మేలు జరిగింది. మనతో పాటు విజయనగరం, మచిలీపట్నం, చిత్తూరు వంటి జిల్లాలకు కూడా ఇదే హెచ్ఆర్ఏ వచ్చేటట్టు చేశాం. అలాగే అంతవరకు కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు మాత్రమే ఉన్న చైల్డ్కేర్ లీవును కూడా రాష్ట్రంలో చేయించగలిగాం. ఇది దేశంలోనే 60 రోజుల పాటు చైల్డ్కేర్ లీవ్ తీసుకువచ్చిన రికార్డు మనకే దక్కింది. ఈ రెండూ శ్రీకాకుళంలో జరిగిన ఎన్జీవోల రాష్ట్ర మహాసభలకు వచ్చిన ముఖ్యమంత్రిని ఒప్పించగలిగాననే ఆనందం ఇప్పటికీ ఉంది.

# APNGGOs' అసోసియేషన్-శ్రీకాకుళం జిల్లా






వాణిజ్య పన్నుల శాఖలో గూడ్స్& సర్వీసెస్ ట్యాక్స్ అధికారిగా,
ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్,గెజిటెడ్ అధికారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా,
మరియు ఆంధ్రప్రదేశ్ జి.ఎస్.టి. అధికారులు మరియు
ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులుగా సుదీర్ఘకాలం జిల్లా
మరియురాష్ట్ర స్థాయిలో ఉద్యోగులకు విశేష సేవలందించి
తేది: 31-12-2024న పదవీ విరమణచేసిన సందర్భంగా మా ప్రియతమ నాయకులు
గా॥శ్రీ॥ చౌదరి పురుషోత్తం నాయుడు గారికి హృదయపూర్వక

## పదవీ విరమణ శుభాకాంక్షలు

**శ్రీ చౌదరి పురుషోత్తం నాయుడు** గారు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
ఎన్జీజీవోస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్
ఏపీ జిఎస్టీ, ఉద్యోగుల సంఘ
రాష్ట్ర అధ్యక్షులు,
గూడ్స్ & సర్వీస్‌ట్యాక్స్ అధికారి,
కాశీబుగ్గ సర్కిల్.

| | |
|---|---|
| **హనుమంతు సాయిరాం**<br>జిల్లా అధ్యక్షులు | **చల్లా శ్రీనివాసరావు**<br>జిల్లా కార్యదర్శి |
| **కె.జయరావు**<br>అసోసియేట్ ప్రెసిడెంట్ | **కె.శ్రీనివాసరావు**<br>ఉపాధ్యక్షులు |
| **ఆర్.వి.ఎన్.శర్మ**<br>పూర్వ జిల్లా కార్యదర్శి | **ఆర్.వేణుగోపాల్**<br>ఉపాధ్యక్షులు |
| **జి.హైమావతి**<br>కన్వీనర్, మహిళా విభాగం | **పి.శ్రావణి**<br>కార్యదర్శి, మహిళా విభాగం |
| **టి.సోమేశ్వరరావు**<br>ఉపాధ్యక్షులు | **డి.శశిభూషణరావు**<br>ఉపాధ్యక్షులు |
| **డి.శ్రీరామ్‌కుమార్**<br>ఉపాధ్యక్షులు | **డి.రాజ్‌కుమార్**<br>ఉపాధ్యక్షులు |
| **పూజారి జానకిరాం**<br>ఉపాధ్యక్షులు | **బి.పూర్ణచంద్రరావు**<br>కోశాధికారి |
| **ఆర్.గోవింద్ పట్నాయిక్**<br>కార్యనిర్వాహక కార్యదర్శి | **డి.అప్పన్న**<br>సంయుక్త కార్యదర్శి |
| **ఎ.జి.ఎం.రాధాకృష్ణ**<br>సంయుక్త కార్యదర్శి | **బి.భాస్కరప్రసాద్**<br>సంయుక్త కార్యదర్శి |
| **జి.రత్నకుమార్**<br>సంయుక్త కార్యదర్శి | **కె.రోజాకుమారి**<br>సంయుక్త కార్యదర్శి |
| **బి.శ్రీనివాసరావు**<br>టౌన్ ప్రెసిడెంట్ | **బి.నవీన్‌కుమార్**<br>టౌన్ సెక్రటరీ |



# హైబ్రిడ్ విధానములో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వ ర్యములో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను స్థానిక సూపరింటెం డింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విద్యుత్ భవన్, శ్రీకాకుళం, టెక్కలి మరియు పలాస డివిజన్ కార్యాలయములలో ఈనెల 07, 08, 10 తేదీల్లో హైబ్రిడ్ విధానములో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని ఏపీఈపీ డీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. జనవరి 7, 8 తేదిలలో "ఎ కన్వెన్షన్ సెంటర్, బృందావన్ కాలనీ, విజయవాడ", జనవరి 10వ తేదిన "కాన్ఫరెన్స్ హలు, కమిషన్ ఆఫీస్ కర్నూలు"లో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4:30గంటల వరకు వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలియజేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్‌ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యం తరాలు వింటామన్నారు. ఈ ధరలపై సందేహాలు, సలహాలు సూచనలు ఇచ్చేందుకు వినియోగదారు లెవరైనా పాల్గొనవచ్చునని, ఈ మేరకు రిజిస్ట్రేషన్ కొరకు స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాల యములో (ఎస్.ఈ.ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయములలో (ఈ.ఈ.ఆఫీస్) సంప్రదించాలని కోరారు. ప్రతిరోజు ముందుగా నమోదు చేసుకున్న వినియోగ దారుల అభ్యంతరాలు విన్న తరువాత విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకోని వినియోగదారుల అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

# ఇంగ్లీష్ మీడియం రద్దు చేస్తే ఊరుకునేదిలేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఇటీవల జరిగిన రచయితల సమావేశంలో జస్టిస్ ఎన్వీ రమణ ఇంగ్లీష్ మీడియం జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని అనడం దురదృష్టకరమని రౌతు శంకరరావు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడే ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని, వారి భవిష్యత్తుకు న్యాయం చేయాలని కోరారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం పెట్టి, కేవలం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు మీడియం అనడం భావ్యమా? ప్రపంచంలో పోటీ బాగా పెరుగుతుందని రాబోయే15-20 ఏళ్లలో ఇంగ్లీష్ భాష లేకపోతే ఉద్యోగాలు సంపాదించడం చాలా కష్టం అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం సిబియస్ఇ, టోఫెల్, ఐబి అన్ని విధానాలను రద్దుచేసి సామాన్యులను ఎదగకుండా చేయాలనే ఆలోచనలో ఉందని రౌతు శంకరరావు అన్నారు. ఇంగ్లీష్ రాక అనేక మంది అధికారులు, లాయర్లు ఇబ్బంది పడటం మన చూస్తున్నామన్నారు. ఇంగ్లీష్ విద్య అభివృద్ధి పరిచేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన టాబ్స్ ఎనిమిదవ తరగతి విద్యార్థులకు గతంలో అందజేశారన్నారు. దానిని కూడా నిలుపుదలచేయడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మంచి విద్యను విద్యార్థులకు అందించాలి కాని కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాసి వ్యాపారం చేయడం తగదన్నారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు కూడా ఒక సబ్జెక్టు ఉంటుందని తెలుగుకు వచ్చిన నష్టం ఏమీ లేదని శంకరరావు అన్నారు. ఈ రాష్ట్రంలో 2020-21 సంవత్సరము నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యాసంస్కరణలు చేపట్టి, విద్యా విధానాన్ని గత ప్రభుత్వం నిర్మిస్తే, ప్రస్తుతం అభివృద్ధి చేయవలసిందిపోయి, నిర్వీర్యం చేయడం తగదన్నారు. ధనికులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చదివించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే యస్.సి/యస్.టి/ బి.సి/ మైనారిటీ/ఈ.బి.సి పిల్లలను మాత్రం తెలుగు మీడియంలో పెట్టి, రానున్న కాలంలో ఉద్యోగాలు ఇతర అవకాశాలు లేకుండా చేయడం ప్రభుత్వ కుట్రకాదా అని ప్రశ్నించారు. ఇంగ్లీష్ మీడియం అమలుల్లో గత ప్రభుత్వ చర్యల కారణంగా కేరళ రాష్ట్రమును మించి ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నిలిచిందన్నారు. జి.ఇ.ఆర్ కూడా గత ప్రభుత్వంలో బాగా పెరిగిందన్నారు. 93.32% విద్యార్థులు యొక్క తల్లిదండ్రులు తీర్మానాలు ఇచ్చి ఇంగ్లీష్ మీడియంకు మొగ్గుచూపితే, ఈ కూటమి ప్రభుత్వం దానికి విరుద్ధంగా రద్దు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. 45వేల పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది పిల్లల చదువును నిర్వీర్యం చేయడం భావ్యం కాదన్నారు. నిజంగా తెలుగు భాషపై అభిమానం ఉంటే ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలో తెలుగు భాషను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రతి గ్రామం, పట్టణంలో ఒక ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఒక తెలుగు మీడియం పాఠశాల పెట్టాలన్నారు. ఎవరికి ఏది ఇష్టమైతే, దాంట్లో చదువుకుంటారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇంగ్లీష్ మీడియం ఉంచి, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తీసివేయడం నిరుపేద విద్యార్థులకు అన్యాయం చేయడమేనన్నారు. ఇంగ్లీష్ మీడియంను అమలు చేసే జీవో నెం.85ను రద్దు చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా చూస్తామని హెచ్చరించారు.






## స్వామి వివేకానంద ప్రభోదాలు విశ్వవ్యాపితం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశ్వవిజేత స్వామి వివేకానంద ప్రభోదాలు సర్వమానవాళికి స్ఫూర్తి నిస్తూ విశ్వవ్యాపితమయ్యాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. హైదరాబాద్ రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ప్రచురిం చిన స్వామి వివేకానంద సాహిత్యం, వార్షిక క్యాలెండర్లను శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ స్వామి వివేకానంద సాహిత్యాన్ని అంతా అధ్యయనం చేయా లని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థా పకులు నటుకుల మోహన్, శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి అధ్య క్షులు మందపల్లి రామకృష్ణారావు, జయ్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతీమోహనరావులు పాల్గొన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666


# విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళా శాల, శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర, బాలికల కళా శాలల్లో చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల తరహా లోనే జూనియర్ కళాశాలల్లో కూడా విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ విద్యాల యాల్లో పలు సంస్కరణల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్న దని వివరించారు. ముఖ్యంగా పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నది. పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు చాలా ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నా రని అయితే జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలు కావడంలేద న్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు ఎక్కువగా చదువుతుంటా రని, మండల కేంద్రాల్లో ఉండే ఈ కళాశాలలకు సుదూర గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ రాక పోకలు సాగిస్తుంటారన్నారు. మధ్యాహ్నం భోజ నాన్ని ఉదయాన్నే వెంట తెచ్చుకుంటుంటారని, వీరి ఇబ్బందులను గమనించిన గత టీడీపీ ప్రభు త్వం 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ జూని యర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివే సిందని చెప్పారు. గత ప్రభుత్వ తీరుపై విద్యా ర్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారని గుర్తు చేశారన్నారు. ఇదిలావుండగా సాధారణ ఎన్నికల ముందు యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాద యాత్రచేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తాము అధికారంలోకి వచ్చిన తరు వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారని చెప్పారు. ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం, నారా లోకేశ్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు చర్యలుచేపట్టారని వివరించారు. 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం' పేరుతో ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## దుర్భర స్థితిలో సవిరిగాం రోడ్డు

(సత్యంన్యూస్, గార)

శ్రీకాకుళం-కళింగపట్నం మార్గంలో సవిరిగాం కూడలి నుంచి ఈ గ్రామానికి వెళ్లే 3కి.మీ రోడ్డు అత్యంత దయనీయమైన స్థితిలో ఉంది. గోతులతో, గుమ్ములతో నిండి ఉంది. 108 అంబులెన్స్, ద్విచక్రవాహనాలకు, ఆటోలు, స్కూల్ బస్సుల రాకపోకలకు ఎంతో ఇబ్బంది కలుగుతోంది. తరచూ ఇవి మరమ్మతులకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డుకు మరమ్మతులను చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.





















Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.